క్లుప్తంగా

కలెక్టర్‌కు దుర్గమ్మ ప్రసాదం అందజేత



విజయవాడ కనకదుర్గమ్మ ప్రసాదాన్ని కలెక్టర్‌కు అందజేసిన డైరెక్టర్ తొత్తడి వేదకుమారి చిత్రంలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

దెందులూరు: విజయవాడ కనకదుర్గమ్మ ప్రసాదాన్ని శనివారం సోమవరప్పాడులో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాద్, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరికి ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వేదకుమారి ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్లను అమ్మవారి ఆలయానికి దర్శనానికి రావాలని ఆహ్వానించారు. ప్రసాదం అందజేసినందుకు వేదకుమారికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి



ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించిన మండల స్పెషల్ ఆఫీసర్ కృపావరం

దెందులూరు: సోమవరప్పాడు గ్రామ సచివాలయంలో ఉన్న ఆధార్ నమోదు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని దెందులూరు మండల ప్రత్యేకాధికారి కృపావరం కోరారు. శనివారం సచివాలయంలో ఆయన ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామ సచివాలయ సిబ్బంది ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటుపై సమాచారం ప్రతి ఒక్కరూ తెలియజేయాలన్నారు. ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి మాట్లాడుతూ ఆధార్ నమోదు కేంద్రం ద్వారా మెరుగైన సేవలందించాలని సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ముంగర శ్రీకాంత్ ఉన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్త మృతికి సంతాపం

పెదపాడు: పెదపాడు మండలంలోని కలపర్రుకి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త ఉప్పాల సంతోష్‌కృష్ణ(36) అకాల మృతికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. శనివారం సాయంత్రం కలపర్రులోని ఎస్సీ కాలనీలోని ఆయన ఇంటికి వెళ్లి సంతోష్ కృష్ణ తల్లి, భార్యను పరామర్శించారు. అనంతరం వారికి ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి కలపర్రు సర్పంచ్ వట్రపు విష్ణుతులసి తదితరులు పాల్గొన్నారు.

మానవత నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



పెదపాడు మానవత నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

పెదపాడు: పెదపాడు మానవత శాఖ నూతన కార్యవర్గం ఆదివారం ప్రమాణ స్వీకారం చేసారు. స్థానిక శ్రీకృష్ణ గురుకుల పాఠశాలలో మానవత విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. మానవత శాఖ ఏర్పాటు అయినప్పటి నుంచి పేదలకు చేస్తున్న సేవలను వివరించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా మానవత రాష్ట్ర ప్రతినిధులు మారుబోయిన కోటేశ్వరరావుతోపాటు విశ్రాంత ఉపాధ్యాయులు పేర్ల సుబ్రహ్మణ్యం, లంకా మహాలక్ష్మయ్య, కుకునూరి రామకృష్ణారావు (రాంబాబు)పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మానవత అధ్యక్షుడు చేవూరి వెంకట్రావు, దావాల వెంకటేశ్వరావు, వేల్పుల ప్రభాకరరావు, గుండపనేని సురేష్, విజ్జి శేఖర్, ఉప్పల రాజారమేష్, ముసునూరి రామకృష్ణ, గారపాటి రాజారామ్మోహనరావు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

భీమడోలు: సూరప్పగూడెంలో పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేసారు. గ్రామంలోని ఓ పామాయిల్ తోటలో పేకాట ఆడుతున్న ఆరుగురికి అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.4800 స్వాధీనం చేసుకున్నట్లు భీమడోలు పోలీసులు తెలిపారు.

రేపు మహా ధర్నా

ఏలూరు (టూటౌన్) : పోలవరం నిర్వాసితుల సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటలకు విజయవాడ ధర్నాచౌక్‌లో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి తెలిపారు. గత నెల 20న అల్లూరి సీతారామరాజు జిల్లా నెల్లిపాక మండలం నెల్లిపాక నుంచి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సారథ్యంలో పోలవరం నిర్వాసితుల పోరు కేక పాదయాత్ర జరుగుతుందన్నారు. ఈ యాత్ర ఈ నెల 4న విజయవాడ ధర్నాచౌక్‌కు చేరుకుంటుందన్నారు. పోలవరం ప్రాజెక్టుకు తాము వ్యతిరేకం కాదని నిర్వాసితులకు న్యాయమైన పరిహారం మాత్రమే తాము కోరుతున్నామన్నారు.

విదేశీ విధానంలో సురక్షిత తాగునీటి సరఫరా

రాష్ట్రంలోని మూడు యూనిట్లలో
ఒకటి పోతునూరులో ఏర్పాటు

దెందులూరు: ప్రయోగాత్మకంగా నెదర్లాండ్ దేశపు సాంకేతిక పరిజ్ఞానంతో ఆరు దశల్లో నీటిని వడపోసి సురక్షితమైన తాగునీటిని పోతునూరు గ్రామ ప్రజలకు గ్రామ పంచాయతీ అందిస్తున్నారు. రాష్ట్రంలో కేవలం మూడు గ్రామ పంచాయతీల్లో ఈ విధానం అమలులో ఉంది. ఆ మూడు గ్రామ పంచాయతీల్లో దెందులూరుల మండలంలోని పోతునూరు ఒకటి. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్, నెదర్లాండ్స్ సాంకేతిక పరిజ్ఞానం సహాయ సహకారంతో 1979 నుంచి పోతునూరులో ఈ విధానం అమలు చేస్తున్నారు. ఒక మీటరు ఇసుక, ఆరు అంగుళాల ఇసుక రబ్బీస్, ఎంఎం బ్లాక్ చిప్స్, ఎంఎం రాయి, చిన్న సిమెంట్ బ్రిక్స్, పెద్ద సిమెంట్ బ్రిక్స్‌ల ద్వారా ఆరుస్థాయిల్లో గ్రామంలోని చెరువులో నీరు ఫిల్టర్ అయి ట్యాంకుకు ఎక్కిస్తారు. ట్యాంకు నుంచి గ్రామంలోని ట్యాప్‌లకు నెదర్లెండ్ సహకారంతో ఫిల్టర్ అయిన తాగునీటిని సరఫరా చేస్తున్నారు. పోతునూరు మేజర్ పంచాయతీ, దాదాపు 10 వేలకుపైగా జనాభా కలిగి ఉంది. 2120 కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. ప్రతి ఒక్కరికీ సురక్షితమైన తాగునీరు అందాలి, నీటి ద్వారా ఏ ఒక్కరూ అనారోగ్యం బారిన పడకూడదు. ప్రతి ఒక్కరూ హక్కుగా నీటిని వినియోగించుకుని సంపూర్ణ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో జీవించాలన్న ఆశయంతో వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్, నెదర్లాండ్ ప్రభుత్వం సహాయ సహకాలు అందిస్తోంది. గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు దూరదృష్టితో కృషి చేసి ఈ విధానాన్ని అవలంభిస్తున్నారు. ఈ విధానం అమలు తీరును విధిగా ఆర్‌డబ్ల్యూఎస్ మండల జిల్లా అధికారులు నెలలో రెండు సార్లు తనిఖీ చేస్తారు. అమలు తీరు, నాణ్యతపై ప్రతి నెల సమీక్ష నిర్వహిస్తారు. ఆర్వో ప్లాంట్లు, ఇతర తాగునీటి శుద్ధి పరికరాలు రాకుండానే 40 ఏళ్ల క్రితమే ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన ఆరు దశల వడపోత ద్వారా సురక్షిత తాగునీటి సరఫరా విధానం సత్ఫలితాలినిస్తోంది. గత రెండు రోజులుగా రక్షిత మంచినీటి పథకంలో ఆరు పద్ధతుల్లో తాగునీరు వడపోత పనులను ఆర్‌డబ్ల్యూఎస్ పర్యవేక్షణలో చేస్తున్నారు.





ఇసుక, రబ్బీస్, బ్లాక్ చిప్స్, రాయి, బ్రిక్స్, పెద్ద బ్రిక్స్‌తో వడపోతకు సిద్ధమవుతున్న ఫిల్లర్ బెడ్లు

ప్రజలకు సురక్షితమైన తాగునీరు



దెందులూరు నియోజకవర్గంలో ఈ విధానం ఉండటం సంతోషంగా ఉంది. రాష్ట్రంలో ఈ విధానం అమలులోఉన్న మూడు పంచాయతీల్లో పోతునూరులో ఉంది. ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. సురక్షితమైన తాగునీటి సరఫరాకు రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో చర్యలు తీసుకున్నాం.

– కొఠారు అబ్బయ్యచౌదరి, దెందులూరు ఎమ్మెల్యే

సమర్థవంతంగా వడపోత, నీటి సరఫరా



నెదర్లాండ్ ప్రభుత్వ సహకారంతో సురక్షితమైన తాగునీరు సరఫరా చేసే గ్రామ పంచాయతీకి సర్పంచ్‌గా ఉన్నందుకు సంతోషంగా ఉంది. నిరంతర పర్యవేక్షణ, ఆరు విధానాల వడపోత, తాగునీరు సరఫరా, పైపులైన్ లీకేజీపై చర్యలు ప్రతి రోజూ తీసుకుంటున్నాము.

– బోదుల స్వరూప్, సర్పంచ్, పోతునూరు

పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడిగా మూర్తి



మూర్తిని అభినందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

నిడమర్రు: నిడమర్రు మండల ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ అసోసియేషన్ (పీఎంపీ) మండల అధ్యక్షుడిగా పెదనిండ్రకొలను వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ చినిమిల్లి నరసింహమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అసోసియేషన్ జిల్లా కన్వీనర్ ఏఆర్‌కే పరమేశ్వర్లు ప్రకటించారు. ఆదివారం పెదనిండ్రకొలనులో పీఎంపీ అసోసియేషన్ మండల కార్యవర్గ సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా నిమ్మల సుబ్బారావు, గౌరవ సలహాదారుడిగా సత్యనారాయణ, కార్యదర్శిగా సంకు శ్రీను, కోశాధికారిగా ఎస్‌కే మోహిద్దీన్, ఉపాధ్యక్షుడిగా ఎస్ఎస్ ఆలీ, జాయింట్ సెక్రటరీగా కె.శ్రీనివాసరావును సభ్యులు ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు నరసింహమూర్తి మాట్లాడుతూ మండలంలోని మారుమూల ప్రాంతాల్లో అసోసియేషన్ తరుపున వైద్య నిపుణులను తీసుకువచ్చి ఉచిత మెగా వైద్యశిబిరాలు నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేసారు. నూతన అధ్యక్షుడు మూర్తిని పలువురు పీఎంపీలు ఘనంగా సత్కరించారు. అబ్దుల్ వాహబ్, శాస్త్రి, కె. రాజేంద్రప్రసాద్ తదితరులున్నారు.

ప్రజల వద్దకే పాలన తీసుకొచ్చాం

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- నడిపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం



నడిపల్లిలో పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : ప్రజల వద్దకే పాలన తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. ఆదివారం 169వ రోజు పెదవేగి మండలంలోని నడిపల్లిలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు. ముందుగా నడిపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి నడిపల్లి సచివాలయ పరిధిలోని ప్రతి గడపకు వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని ప్రతి ఒక్కరినీ అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి పథకాలు అందని వారిని గుర్తించి వారికి న్యాయం చేసేందుకు జగనన్న సురక్ష పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. అర్హులకు పథకాలు అందించాలని సంబంధిత అధికారులకు, వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, ఎంపీపీ తాతా రమ్య, సర్పంచ్ మేక అప్పాయమ్మ, గ్రామ పార్టీ అధ్యక్షులు ఉక్కుర్తి నాగేశ్వరరావు, నాయకులు గొట్టేటి స్టాలిన్, ఇతర ప్రజా ప్రతినిధులు, సొసైటీ అధ్యక్షులు, పార్టీ అధ్యక్షుడు, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, సభ్యులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు

చురుగ్గా భీమడోలు శివాలయం అభివృద్ధి పనులు





భీమడోలు శివాలయం చుట్టూ ప్రహరీ నిర్మాణం, ఆలయానికి రంగుల వేస్తున్న దృశ్యం

భీమడోలు: దేవాదాయ ధర్మశాఖ ఆధీనంలోని భీమడోలులోని అతిపురాతన దేవాలయం పార్వతీ సమేత భీమేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. కాకతీయుల కాలం నాటి ఈ ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ఆలయ అభివృద్ధి కమిటీ తగు చర్యలు చేపట్టింది. దీనితో దాతల నుంచి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, దేవదాయ ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ మేడేపల్లి విజయరాజు ప్రత్యేక శ్రద్ధ, తగు సహకారంతో ఈ పనులకు శ్రీకారం చుట్టారు. దాతల నుంచి సమకూరిన రూ.లక్ష విరాళాలతో ఆలయంలో ప్రహరీ నిర్మాణం, ఫ్లోరింగ్, షెడ్లు, ఆలయానికి రంగుల వేసే పనుల చేపట్టారు. ఆలయ అభివృద్ధి కమిటీ నిర్వాహకులు చింతా శ్రీరామచంద్రమూర్తి, చింతా సత్తిబాబు సంయుక్త ఆధ్వర్యంలో దాతలు ఇచ్చిన విరాళాలతో ఆలయ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఆలయం చుట్టూ ప్రహరీ లేకపోవడంతో నిర్మాణ పనులు చేపట్టారు. ఆలయంలో అభివృద్ధి పనుల్లో భాగంగా ఫ్లోరింగ్, ప్రహరీ, రంగులు వేసే పనుల్లో 40 శాతం పూర్తయ్యాయి. మండలంలో ప్రసిద్ధి చెందిన ఈ ఆలయాన్ని అభివృద్ధి పర్చేందుకు దాతల ఆర్థిక సాయం, సహకారం మరవలేనిదని పలువురు కమిటీ సభ్యులు తెలిపారు. మరికొంత దాతలు ముందుకు వస్తే అభివృద్ధి పనులకు ఊతం ఇచ్చిన వారవుతారని వారు పేర్కొన్నారు.

నీతి కథల పఠనంతో నైతిక విలువలు వృద్ధి



భీమడోలు శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న చిన్నారులు

భీమడోలు: నీతి కథలు చదవడం ద్వారా నైతిక విలువలు అలవడతాయని పలువురు వక్తలు కొనియాడారు. మండలంలోని భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని పుస్తక పఠనం చేసారు. పుస్తక ప్రదర్శనలు ఏర్పాటు చేసారు. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలకు చెందిన బాలబాలికలు పాల్గొని సామూహిక పుస్తక పఠనం చేసారు. చిన్నారులు కథలు, జీవిత చరిత్ర పుస్తకాలు, దినపత్రికలు చదివారు. ఈ కార్యక్రమంలో పూళ్ల, గుండుగొలను గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, పెద్దలు మోహనరావు, కడగల సత్యనారాయణ, పాఠకులు, చిన్నారులు పాల్గొన్నారు.

వేసవి దుక్కు.. పంటకు మేలు



గణపవరంలో వేసవి మెట్ట దుక్కు చేసిన పొలం

గణపవరం: రబీ పంట మాసూళ్ల అనంతరం వేసవి దుక్కులకు (మెట్ట దుక్కు) రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. వేసవి దుక్కులవల్ల ఎన్నో లాభాలు ఉంటాయని, భూసారం పెంచుకోవచ్చునని చెబుతున్నారు. రబీ కోతలు కోసినతర్వాత పొలాలు పూర్తిగా ఎండిపోయి ఉంటాయి. ఆ దశలో వేసవి దుక్కులు చేసుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. గతంలో వ్యవసాయంలో యంత్రాల వాడకంలేని కాలంలో రైతులు ఎడ్లకు నాగలికట్టి రబీ కోతలు పూర్తయిన కొద్ది రోజులకు వేసవిలో కనీసం ఒకసారైనా మెట్టదుక్కు దున్నేవారు. వర్షాలు కురిసి, కాల్వలకు నీరు వచ్చిన తర్వాత మరోసారి దుక్కి దున్నేవారు. ట్రాక్టర్లు అందుబాటులోకి వచ్చిన తర్వాత రైతులు పొలాల్లోకి నీరు వచ్చిన తర్వాతే వెంటవెంటనే తొలిసాలు, మలిసాలు దమ్ములు పూర్తి చేస్తున్నారు. ఇటీవల కొద్దిమంది రైతులు మాత్రమే వేసవి దుక్కులకు ప్రాధాన్యత ఇస్తుండగా అధిక శాతం రైతులకు ఆ ఊసేలేకుండా పోయింది. ప్రస్తుతం నారుమడులు వేస్తున్నందున, నాట్లు వేయడానికి ఇంకా సమయం ఉండటంతో రైతులు ఒకసారి మెట్ట దుక్కు చేసుకుంటే మేలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

ఉపయోగాలెన్నో: వేసవి దుక్కులతో ఎన్నో ఉపయోగాలున్నాయి. కలుపు, కేళీల నివారణకు ఇవి దోహదపడతాయి. మొండి జాతికి చెందిన గడ్డి మొక్కలు, ఇతర కలుపు మొక్కల మూలాలు పైకివచ్చి ఎండకు ఎండిపోతాయి. మెట్టదుక్కు వల్ల భూసారం వృద్ధి చెందుతుంది. ట్రాక్టరుకు నాగలికట్టి ఆరు అంగుళాల లోతువరకూ దుక్కుదున్నడం వల్ల పొలంలోని మట్టి తిరగబడుతుంది. దీంతో దాళ్వా పంటనుంచి భూమిలోకిచేరిన క్రిమికీటకాలు పురుగుల గుడ్లు బయటకు వచ్చి ఎండల తీవ్రతకు నశించిపోతాయి. ముఖ్యంగా కాండం తొలుచుపురుగు, ఆకుముడుత, కాండం కుళ్లు తెగులు కారకాలైన పురుగులు గుడ్లు పొదిగి నేలల్లో ఉంచుతాయి. ఇవి తదనంతరం వచ్చే పంటలో మళ్లీ ఆ తెగుళ్లు వ్యాప్తిచెంది, పంటకు నష్టం జరుగుతుంది. దాళ్వా మాసూళ్ల అనంతరం పొలంలో ఉండిపోయిన గడ్డి మట్టిలో కలిసి చీకిపోయి, సేంద్రియ ఎరువులా ఉపయోగపడుతుంది. తద్వారా భూసారం పెరిగి ఎరువుల వినియోగం, పురుగుమందుల వినియోగం తగ్గడంతోపాటు దిగుబడి పెరుగుతుంది.

ఏబీసీ క్రికెట్ టోర్నమెంట్ విజేత ‘విజయరాయి’



ఏబీసీ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి

పెదవేగి : ఉత్కంఠ భరితంగా సాగిన క్రికెట్ తుది పోరులో విజయరాయి జట్టు చాంపియన్‌గా నిలిచింది. పెదవేగి మండలం విజయరాయిలో నిర్వహించిన ఏబీసీ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌కు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి విచ్చేసి, వీక్షించారు. ఫైనల్ మ్యాచ్‌లో విజయరాయి, రాట్నాలకుంట జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో విజయరాయి జట్టు విజయకేతనం ఎగురవేసింది. ఈ టోర్నమెంట్‌లో 30 పైగా జట్లు పాల్గొన్నాయి. ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో మొదటి స్థానంలో నిలిచిన విజయరాయి జట్టుకు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి వ్యక్తిగతంగా రూ.30 వేల నగదు బహుమతిని అందజేసి అభినందించారు. ద్వితీయ స్థానంలో నిలిచిన రాట్నాలకుంట జట్టును, తృతీయ స్థానంలో నిలిచిన నడిపల్లి జట్టును ఎమ్మెల్యే అభినందించి ట్రోఫీలు అందజేశారు. విజయరాయి గ్రామ యువకుల అభ్యర్థన మేరకు క్రికెట్ కిట్ కోసం మరో రూ.10 వేలు ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, బీసీ నేత ఘంటా ప్రసాదరావు, గ్రామ నాయకులు పులగం వేగుగోపాల్‌రెడ్డి, గొట్టాపు నాగేంద్ర, లేగల శివ, పీబీ శ్రీనివాసకృష్ణ, బైగాని రంగారావు, రెడ్డెం శ్రీనివాసరెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, సొసైటీ అధ్యక్షులు, నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

వర్గీకరణ సాధనకు ఐక్యంగా కృషి



వేగివాడలో పోస్టర్ ఆవిష్కరణ చేస్తున్న ఎంఆర్‌పీఎస్ నేతలు

పెదవేగి : ఎస్సీ వర్గీకరణ సాధించి జాతి మనుగడ కోసం అందరూ కలసి కట్టుగా కృషి చేయాలని ఎంఆర్పీఎస్ ఇన్‌చార్జ్ కొత్తపల్లి మురళి చెప్పారు. పెదవేగి మండలం వేగివాడ పంచాయతీ బత్తెవరం గ్రామంలో మురళి ఆధ్వర్యంలో ఈ నెల 6న నిర్వహించనున్న హలో మాదిగ చలో కొయ్యలగూడెం కార్యక్రమంపై సన్నాహక సమావేశం ఆదివారం బత్తెవరంలో నిర్వహించారు. కొయ్యలగూడెం మండలం అంకాలగూడెంలో ఏర్పాటు చేసిన బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహావిష్కరణ అనంతరం ఎస్సీ వర్గీకరణ లక్ష్యంగా చలో హైదరాబాద్ సభను విజయవంతం చేసేందుకు ఏలూరులో నిర్వహించనున్న జిల్లా సన్నాహక సభకు మందా కృష్ణ మాదిగ హాజరు కానున్నారని కొత్తపల్లి మురళి తెలిపారు. ఈ సందర్భంగా హలో మాదిగ చలో అంకాలగూడెం, చలో హైదరాబాద్ కార్యక్రమాల విజయవంతంపై పోస్టర్ ఆవిష్కరణ వేగివాడలో జరిగింది. ఈ కార్యక్రమానికి కోస్తా ఆంధ్ర జిల్లాల ఎంఆర్పీఎస్, ఎంఎస్‌పీ సమన్వయ కర్తలు ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు మాదిగ, జిల్లా ఎంఎస్‌పీ కన్వీనర్ కనకరాజు మాదిగ, కాట్రు పవన్, కాట్రు వెంకటేశ్వరరావు, లక్కపాము శ్రీనివాసరావు, బొకినాల నాగరాజు, కాట్రు రత్నం, కాట్రు లక్ష్మీ, కొండపల్లి ముక్కయ్య, తాడిగడప రామ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

వాసవి క్లబ్ గోల్డ్ యూత్ సేవలు అభినందనీయం

ఏలూరు టౌన్ : వాసవి క్లబ్ గోల్డ్ యూత్ సేవలు అభినందనీయమని ఏలూరు సీసీఎస్ సీఐ సీహెచ్ మురళీకృష్ణ అన్నారు. ఏలూరు వాసవిక్లబ్ గోల్డ్ యూత్ ఆధ్వర్యంలో ఏలూరు కోటదిబ్బ సీసీఎస్ పోలీస్‌స్టేషన్ వద్ద బాధితులు, ప్రజలకు కూర్చొనేందుకు ఏర్పాటు చేసిన రెండు సిమెంట్ బెంచీలను ఆయన ఆదివారం ప్రారంభించారు.

జగనన్న సురక్ష శిబిరాల్లో స్పందన ఫిర్యాదుల స్వీకరణ

ఉంగుటూరు: జగనన్న సురక్ష కార్యక్రమంలోనే స్పందన ఫిర్యాదులు స్వీకరించనున్నట్టు తహసీల్దారు వెంకటరమణ తెలిపారు. జగనన్న సురక్ష కారణంగా జిల్లాస్థాయిలో స్పందన కార్యక్రమం నిలుపుదల చేశారని, ఈమేరకు సురక్ష కార్యక్రమంలోనే స్పందన ఫిర్యాదులు స్వీకరించాలని కలెక్టర్ ఆదేశాలిచ్చారని తెలిపారు. వెల్లమిల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నందున అక్కడ స్పందన ఫిర్యాదులు స్వీకిరిస్తారని తహసీల్దారు వివరించారు.

నేడు శ్రీరామవరంలో జగనన్న సురక్ష

దెందులూరు: మండలంలోని శ్రీరామవరం గ్రామ సచివాలయంలో ఉదయం 8 గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ముఖ్య అతిథిగా పాల్గొంటారని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు, సర్పంచ్ కామిరెడ్డి నాని తెలిపారు. శ్రీరామవరం గ్రామంలో వైఎస్సార్ రైతుభరోసా కేంద్రం ప్రారంభించి శ్రీరామవరం నుంచి సీతంపేట వరకు నిర్మించనున్న రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 9.30 గంటల వరకు కొవ్వలి సచివాలయం–2 పరిధిలో నిర్వహించే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని కొవ్వలి వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కాటి సుధాకర్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆపదలో ఉన్న వారికి సహాయం అందిస్తాం



ఆర్‌సీఎం చర్చి వద్ద యువత, ఫాదర్లు, సంఘ పెద్దలు

పెదవేగి : ఆపదలో నిస్సహాయంగా ఉన్న వారిని అన్ని రకాలుగా ఆదుకునేందుకు ఆర్‌సీఎం యువత ముందుకు రావడం అభినందనీయమని విచారణ ఫాదర్ మురళి అన్నారు. పెదవేగి మండలం గార్ల మడుగు పంచాయతీ కల్లేపల్లివారిగూడెంలో ఎంఎస్ఎఫ్ఎస్ సంస్థ ఇయర్ ఆఫ్ ద ఫ్రాన్సిలిన్ యూత్ ఇయర్ జరుపుకుంటున్న సందర్భంగా ఏలూరు డయాసిస్‌లోని, ఎస్ఎఫ్ఎస్ క్వాసీ పారిష్ పరిధిలోని మూడు గ్రామాలైన కల్లేపల్లివారిగూడెం, కవ్వగుంట, చిన్న మాలపల్లిలో విచారణ గురువులు ఫాదర్ మురళి చేతులు మీదుగా ఫ్రాన్సిలిన్ యువత సంవత్సరాన్ని ఆవిష్కరించారు. ముఖ్యంగా ఆదివారం కల్లేపల్లివారి గూడెం అద్భుత బాలయేసు దేవాలయంకి సంబంధించిన యువత ఫాదర్ మురళి, నేతృత్వంలో ఫాదర్ వేలంగిని, ఫాదర్ జార్జ్ సంఘ పెద్దలు సహాయంతో ఇన్‌ఫాంట్ జీసస్ అనే నామకరణంతో ఒక సంస్థగా ఏర్పడి, నిస్సహాయు లకు సహాయకులుగా ఉంటామని ఆపదలో ఉన్నవారికి ఆర్థిక సహాయం ఆసుపత్రిలో ఉన్నవారికి పండ్లు, ఫలహారాలు లాంటివి అందిస్తామని అన్నారు. టు హెల్ప్ ద హెల్ప్ నెస్ అనే నినాదంతో ఉత్సాహంగా ఎన్నో సేవ కార్యక్రమాలు చేయటానికి ముందుకు వచ్చామని యువత అన్నారు. ఈ మేరకు మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు.